# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-03-2026 సమయం : సాయంకాలం 6గం.10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రంలో గ్యాస్ సరఫరాలో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులకు సూచించారు.
- ❖ గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు.
- ❖ అమరావతి పరిధిలోని గ్రామాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.
- ❖ గ్యాస్ సరఫరాలో బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పయ్యావుల కేశవ్ హెచ్చరించారు.
- ❖ దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో బీసీ రక్షణ చట్టం అమలు చేయబోతున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత వెల్లడించారు.

========================

రాష్ట్రంలో గ్యాస్ సరఫరాలో సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులను ఆదేశించారు. పలువురు మంత్రులతో ముఖ్యమంత్రి ఈరోజు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని గ్యాస్ సమస్య లేకుండా చూడాలన్నారు. హోటళ్లు సహా భాగస్వామ్య పక్షాలతో మాట్లాడి.. వాస్తవ పరిస్థితికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించాలని మంత్రులకు చంద్రబాబు నాయుడు సూచించారు.

========================

గిరిజనుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నందిగరువు గ్రామంలో ఉపముఖ్యమంత్రి ఈరోజు మాటా.. మంతి.. కార్యక్రమం నిర్వహించారు. గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకుని వారి సమస్యలన్నీటిని పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటికే 460 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధికి కీలకమైన జీవో నెంబర్- 3 పునరుద్ధరణపై ముఖ్యమంత్రితో చర్చించి.. సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు జల్ జీవన మిషన్ పథకం కింద ఏర్పాటు చేసిన మంచినీటి కులాయిలను పరిశీలించారు.

=======================

రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో ప్రస్తుతం 30 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతిలోని అనంతవరం, నెక్కలు గ్రామసభల్లో మంత్రి నారాయణ, సీఆర్డీఏ అధికారులు ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ ఏడాది జూన్ నాటికి అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నివాసాలు పూర్తి అవుతాయని స్పష్టం చేశారు. 2027 జూన్ నాటికి రాజధానిలో 360 కిలోమీటర్ల ట్రంక్ రోడ్డు, 1,500 కిలోమీటర్ల లేట్ అవుట్ రోడ్లు పూర్తి అవుతాయని వెల్లడించారు. 2028 డిసెంబర్ నాటికి ఐకానిక్ భవనాలు పూర్తి అవుతాయని నారాయణ పేర్కొన్నారు. అమరావతి పరిధిలోని గ్రామాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు.

=======================

దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో బీసీ రక్షణ చట్టం అమలు చేయబోతున్నామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత వెల్లడించారు. విజయవాడలో మంత్రి సవిత అధ్యక్షతన బీసీ రక్షణ చట్టం రూపకల్పనపై ఈరోజు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ... బీసీల మాన, ప్రాణాలకు భరోసా కల్పించేలా బీసీ రక్షణ చట్టాన్ని పటిష్టంగా రూపొందిస్తున్నామని తెలిపారు. బీసీలను అన్ని రంగాల్లో ముందు నిలపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

సింహాచలం చందనోత్సవం, కల్యాణోత్సవం ఏర్పాట్లపై ఆలయ అధికారులు, అర్చకులతో హోం మంత్రి వంగలపూడి అనిత సింహాచలంలో ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ... గత సంవత్సరం చందనోత్సవానికి సుమారు లక్షా 20 వేల మంది భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారని, ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. సామాన్య భక్తుల దర్శనానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో గ్యాస్ సంక్షోభం లేకుండా ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరిస్తోందని, ప్రజలు వదంతులను నమ్మవద్దని అనిత కోరారు.

విరామం

=======================

గ్యాస్ సరఫరాలో బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ హెచ్చరించారు. విజయవాడలో వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి గ్యాస్ సరఫరాపై అధికారులతో సమీక్ష సమావేశం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... గ్యాస్ సరఫరాలో ఎక్కడా ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్ తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలన్నారు. దేశంలో వినియోగిస్తున్న గ్యాస్‌లో సుమారు 20 శాతం వరకు భారత రిఫైనరీల నుంచే ఉత్పత్తి అవుతోందని, గ్యాస్ సరఫరాలో ఆసుపత్రులు, గృహ వినియోగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

పదవ తరగతి (SSC) వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని విశాఖపట్టణం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్ తెలిపారు. విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పదవ తరగతి పరీక్షలు ఈనెల 16న  ప్రారంభమై.. ఏప్రిల్ 01వ తేదీ వరకు జరుగుతాయని, ఉదయం 10 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని స్పష్టం చేశారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక తెలిపారు. ఒంగోలులో ఈరోజు విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... పదవ తరగతి పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ పదవ తరగతి పరీక్షలు కూడా ఈ నెల 16వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 132వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 27వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

========================

ప్రభుత్వం డొక్కా సీతమ్మ పేరిట పాఠశాలలు, జూనియర్ కళాశాలలో ప్రతిష్టాత్మకంగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ఎం.ఎం.కె.ఎన్. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమల తీరును మంత్రి ఈరోజు పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతిరోజు మధ్యాహ్నం భోజనం నాణ్యతను ఒక టీచరు పరిశీలించాలన్నారు.

========================

ఉత్తరప్రదేశ్‌లోని మధ్య ప్రాంతాల నుంచి అంతర్గత ఛత్తీస్‌గఢ్ మీదుగా దక్షిణ అంతర ఒడిశా వరకు ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. వీటి ఫలితంగా ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో రేపు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని తెలిపారు. ఎల్లుండి తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందన్నారు.

========================

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఈ నెల 23వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్టీల్ ప్లాంట్ కు శంకుస్థాపన చేయనున్నారు. స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన చేయనున్న ప్రాంతాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత ఈరోజు పరిశీలించారు. ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులు రానున్న నేపథ్యంలో భద్రత పరమైన అంశాలపై మంత్రి అధికారులతో చర్చించారు.

========================
========================